క్లుప్తంగా

అయ్యప్ప సన్నిధిలో ఆరాట్టు ఉత్సవం రేపు



పెందుర్తి: సుజాతనగర్‌లోని పూర్ణపుష్కల సమేత ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో స్వామి జన్మ దినం సందర్భంగా శుక్రవారం ఆరాట్టు ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖరెడ్డి బుధవారం తెలిపారు. శబరిమలలో ఆరాట్టు ఉత్సవం ఎలా నిర్వహిస్తారో ఇక్కడ కూడా అదే సంప్రదాయం, పద్ధతిలో జరపనున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు స్వామివారికి అభిషేకాలతో పాటు విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులంతా ఉత్సవంలో పాల్గొనాలని కోరారు.

నేడు బంగారుమాంబ పండగ



పరవాడ: మండలంలోని గొర్లివానిపాలెంలో కొలువుదీరిన బంగారుమాంబ అమ్మవారి పండగను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి బంగారుమాంబ అమ్మవారిని భక్తులు దర్శించుకునేలా ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు. రాత్రికి అమ్మవారిని పురవీధుల్లో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగిస్తామన్నారు. అనంతరం భారీ బాణసంచా వెలుగుల్లో అమ్మవారి అనుపు మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పండగ మహోత్సవంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు సర్పంచ్ వెల్లడించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కళాకారులను సత్కరిస్తున్న దేవస్థానం ఉద్యోగి ప్రసాద్

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడవరోజైన బుధవారం సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. రాజగోపురం పక్కన కళావేదికపై విశాఖకు చెందిన అన్నమాచార్య సేవా ట్రస్ట్ కళాకారులు, గాజువాక మాతృశ్రీ సాయి బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. దేవస్థానం తరఫున జూనియర్ అసిస్టెంట్ ఎమ్.ప్రసాద్ కళాకారులను సత్కరించారు.

ఘనంగా దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం



బలిజపాలెం దుర్గాలమ్మ సన్నిధిలో గండి రవికుమార్ తదితరులు

సబ్బవరం: మండలంలోని నారపాడు శివారు బలిజపాలెంలోని దుర్గాలమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ పార్టీ నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో ఆలయ ధర్మకర్త, మాజీ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ సేనాపతి దుర్గ అప్పారావు, ధనలక్ష్మి, పార్టీ నాయకులు తాసుబిల్లి కనకరాజు, యడ్ల నాయుడు, ఐడీ బాబు, సిరపరపు వాసు, బత్తిన వెంకట్, తాసుబిల్లి అప్పలనాయుడు, మామిడి రాము, ముక్కు శ్రీను, కె.చక్రి తదితరులు ఉన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుభాషిణి తదితరులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు బుధవారం నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.సుభాషిణిలు మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. రెగ్యులర్ గ్రూపులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీతో పాటు, ఒకేషనల్ గ్రూపులలో ప్రవేశాలకు టెన్త్ పరీక్షలు పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పెందుర్తి రైల్వే స్టేషన్లో.. సమస్యల కూత

- రైల్వేస్టేషన్‌లో కానరాని కనీస సదుపాయాలు
- తాగునీరు, మరుగుదొడ్లు లేక ప్రయాణికుల అవస్థలు
- ముఖ్యమైన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కూడా ఇవ్వని దుస్థితి
- అభివృద్ధికి నోచుకోని రైల్వే స్టేషన్, పెందుర్తి అప్రోచ్ రోడ్డు



పెందుర్తి రైల్వే స్టేషన్

గుక్కెడు నీరు తాగుదామన్నా.. నాచుపట్టి, అపరిశుభ్రంగా కనిపించే కుళాయిలు.. పురాతన జ్ఞాపకాలకు ఆనవాలుగా టికెట్ బుకింగ్ కౌంటర్.. ప్రమాదకరమైన ప్లాట్‌ఫాంలు.. ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు.. రైళ్ల రాకకోసం కూర్చుని నిరీక్షిద్దామన్నా బల్లలు కానరాని ప్లాట్‌ఫాంలు.. ఇవి చాలు పెందుర్తి రైల్వే స్టేషన్ దుస్థితి తెలుసుకునేందుకు. నగర శివారున ఇ–'కేటగిరీకి చెందిన ఈ రైల్వే స్టేషన్ దశాబ్దాలుగా అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయింది. ప్రభుత్వాలు మారుతున్నా ఈ స్టేషన్ దుస్థితిలో మాత్రం మార్పు రావట్లేదు.



స్టేషన్‌లోని మంచినీటి కుళాయి దుస్థితి

పెందుర్తి: నగరానికి దీటుగా పెందుర్తి ప్రాంతం అభివృద్ధిలో పోటీపడుతున్నా.. అందుకు తగ్గట్టుగా రైల్వేస్టేషన్‌లో సదుపాయాలు మాత్రం కానరావడం లేదు. మొన్నటి రైల్వే బడ్జెట్‌లో ఈ స్టేషన్‌కు కనీస కేటాయింపులు లేకపోవడంతో ఈ ఏడాది కూడా యథావిధిగా సమస్యల 'కూత'కొనసాగనుంది. మరోవైపు పెందుర్తి రైల్వే స్టేషన్ నుంచి పెందుర్తి కూడలికి చేరుకోవడానికి ఉన్న అప్రోచ్ రోడ్డును రైల్వే శాఖే అభివృద్ధి చేయాల్సి ఉంది. కానీ రైల్వే అధికారులకు ఆ రోడ్డు ఒకటి ఉందన్న విషయం తెలుసో.. లేదో.. అన్న సందేహాన్ని స్థానికులు వెలిబుచ్చుతున్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన



'అమృత్ భారత్ స్టేషన్ల'లోనూ దీనికి చోటు దక్కలేదు. రాష్ట్రం నుంచి 73 స్టేషన్లు ఉన్నా.. పెందుర్తి స్టేషన్ అభివృద్ధికి మాత్రం చిల్లి గవ్వైనా విదిలించే పరిస్థితి కనిపించట్లేదు.

ఒక్క నిముషమైనా..

పెందుర్తి రైల్వే స్టేషన్ మీదుగా 16 పాసింజర్ రైళ్లతో పాటు, పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. రోజూ ఇక్కడి నుంచి దాదాపు 600–900 మంది వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. అరకు, ఒడిశా, విజయనగరం మీదుగా ఉత్తర భారతదేశం వెళ్లే రైళ్లు పెందుర్తి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ కేవలం పాసింజర్ రైళ్లు మాత్రమే ఇక్కడ ఆగుతాయి. సూపర్ ఫాస్ట్‌లకు హాల్ట్ ఇవ్వకపోయినా.. కనీసం ఎక్స్‌ప్రెస్‌లకైనా ఒక్క నిమిషం హాల్ట్ ఇవ్వాలని కోరుతున్నా.. పట్టించుకునే పరిస్థితి లేదు. దీంతో చాలా మంది ప్రయాణికులు నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్‌కు, లేదా కొత్తవలస స్టేషన్‌కు వెళ్లి రైళ్లు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది.

'అప్రోచ్'లేదేం!

స్టేషన్ నుంచి పెందుర్తి కూడలికి దాదాపు రెండు కిలోమీటర్ల మేర అప్రోచ్ రోడ్డు ఉంది. దీన్ని కొంత వరకు జీవీఎంసీ అభివృద్ధి చేసింది. స్టేషన్‌కు దగ్గరలో ఉన్న రోడ్డు అభివృద్ధి బాధ్యత మాత్రం రైల్వే శాఖ చూసుకోవాలి. కానీ రైల్వే అధికారులు దీనిపై పూర్తిగా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రైల్వే స్టేషన్‌లో సదుపాయాల కల్పనతో పాటు, రోడ్డు అభివృద్ధికి చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.



అభివృద్ధికి నోచుకోని అప్రోచ్ రోడ్డు



ఎత్తు తక్కువ ఉన్న ప్లాట్‌ఫాం

సమస్యలు చిన్నవే.. అయినా..

దేశ రైల్వే వ్యవస్థలో ఏదో మారుమూల కుగ్రామంలో మాత్రమే పరిష్కారానికి నోచుకోని సమస్యలు పెందుర్తి స్టేషన్లో కొనసాగుతూనే ఉన్నాయి. రైల్వే స్టేషన్లో తాగునీటి సదుపాయం లేదు. ఉన్న కుళాయిల నుంచి శుద్ధిచేయని నీరు మాత్రమే వస్తుంది. మరుగుదొడ్ల ఊసే లేదు. నగరంలోని అన్ని స్టేషన్లకూ ఆధునిక టికెట్ కౌంటర్లు వచ్చినా ఇక్కడ మాత్రం నేటికీ పాతతరం కౌంటరే దిక్కయింది. ఫ్లాట్‌పాం ఎత్తు తక్కువగా ఉండడంతో రైలు ఎక్కేటపుడు ప్రయాణికుల కాళ్లు ఇరుక్కుపోయి తరచూ గాయపడుతున్నారు. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ఇలాంటి సమయంలో పెనుప్రమాదం సంభవించే అవకాశం ఉంది.

కనీస సదుపాయాల్లేవ్



పెందుర్తి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు ఎటువంటి సౌకర్యాలూ లేవు. ఇక్కడ నుంచి దేశంలోని అనేక ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తుంటారు. దాని కోసం కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఒక నిమిషం హాల్ట్ ఇవ్వాలి. ఫ్లాట్‌ఫాం ఎత్తు తక్కువ ఉండడంతో అనేక మంది ప్రమాదాలకు గురయ్యారు. తాజా కేంద్ర బడ్జెట్‌లో కూడా ఈ స్టేషన్‌కు అంతగా ప్రాధాన్యత దక్కలేదు. ఇది చాలా దారుణం.

– కుచ్చు సూర్యారావు, పెందుర్తి

ఆధునికీకరించాలి



చాలా ఏళ్లుగా ఈ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్న వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్కోసారి కనీసం తాగునీరు కూడా సక్రమంగా సరఫరా చేయరు. ప్లాట్‌ఫాం వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పట్టణం అభివృద్ధి చెందుతున్న దశలో ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్‌పై కూడా అధికారులు ఆలోచించాలి. తగిన నిధులను కేటాయించి అభివృద్ధి చేయాలి.

– ఎ.కిషోర్, పెందుర్తి

ప్రజలను వంచించిన కూటమి ప్రభుత్వం



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, (ఇన్‌సెట్) పెందుర్తి కూడలి వద్ద మానవహారం

- గ్యాస్ ధరల పెంపుపై నిరసనలో సీపీఐ నాయకులు

పెందుర్తి: ఎన్నికల సమయంలో ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం, ప్రజలను దారుణంగా వంచించిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్ ఆరోపించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మద్దతులోనే కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై భారం మోపిందని ధ్వజమెత్తారు. గ్యాస్ సిలిండర్ ధర పెంపునకు నిరసనగా పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి వద్ద సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కిందని మండిపడ్డారు. సంపన్నులకు రాయితీలు, ఇతర ప్రయోజనాలను కల్పిస్తున్న కేంద్ర ప్రభుత్వం పేదల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆక్షేపించారు. పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అసిరినాయుడు, అన్నపూర్ణ, అరుణ, శ్రీరామ్, జ్యోతి, స్థానికులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న మాధవ్, చిత్రంలో బీజేపీ నేతలు

పెందుర్తి: క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. స్థానిక తాండ్రపాపారాయుడు కల్యాణ మండపంలో పార్టీ క్రియాశీలక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఎంతో పురోగతి సాధించిందన్నారు. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. పలు అంశాలపై చర్చించారు. పెందుర్తి బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రాము నాయుడు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పట్టాభి ప్రసాద్, పిల్ల సతీష్‌కుమార్, గొంప నరసింగరావు, చిక్కాల సతీష్, నాగమణి పాల్గొన్నారు.

13న గురుకుల ప్రవేశ పరీక్ష

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలకు ఈ నెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు, ఇంటర్ ఫస్టియర్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సంబంధిత వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్, ఆధార్ కార్డ్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తెచ్చుకోవాలన్నారు. పరీక్షకు కనీసం అరగంట ముందుగా హాజరుకావాలన్నారు.

అధ్వానంగా సోమునాయుడుపాలెం రోడ్డు



రాళ్లు తేలి, ఛిద్రమైన సోమునాయుడుపాలెం రోడ్డు

పరవాడ: మండలంలోని రావాడ శివారు సోమునాయుడుపాలెం రహదారి అధ్వానంగా మారింది. దీంతో రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్ల నుంచి రహదారికి మరమ్మతులు చేపట్టకపోవడంతో రాళ్లు లేచిపోయి, పూర్తిగా ఛిద్రమైంది. వీధి దీపాలు కూడా లేకపోవడంతో రాత్రి వేళ చీకటిలో రోడ్డుపై విష జంతువులు సంచరిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. సోమునాయుడుపాలెం, మూల స్వయంభూవరం గ్రామాల నుంచి ఎన్టీపీసీ, హిందూజా, ఫార్మాసిటీ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, విద్యార్థులు, వ్యవసాయదారులు రాళ్లు లేచిన రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని అధికారులను వేడుకున్నా ప్రయోజనం కనిపించట్లేదని వాపోతున్నారు. ప్రజల ఇబ్బందుల్ని గుర్తించి రోడ్డు మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పింఛన్‌దారుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న అధ్యక్షుడు కృష్ణారావు

పెందుర్తి: రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని పెందుర్తి శాఖ పింఛన్‌దారుల సంఘం అధ్యక్షుడు అల్లం కృష్ణారావు అన్నారు. చినముషిడివాడలోని సంఘ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్‌దారులు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పింఛన్‌దారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. కార్యదర్శి కామరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఈశ్వరరావు, కోశాధికారి పాపారావు, సంయుక్త కార్యదర్శులు జగన్నాథం, రామునాయుడు, సభ్యులు రామానందం, తాతారావు, సూర్యారావు, రామకృష్ణ, నరసింహమూర్తి, పాణిగ్రాహి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కదలని మురుగు.. ఎక్కడి చెత్త అక్కడే



వినాయకనగర్ ఆదర్శగ్రౌండ్ ప్రధాన గెడ్డలో వ్యర్థాలు

పెదగంట్యాడ: మండలంలోని కాలువలు, గెడ్డలు చెత్తా చెదారంతో నిండిపోయి మురుగు కంపు కొడుతున్నాయి. నెలలు తరబడి మురుగు నిలిచిపోవడంతో చుట్టపక్కల ప్రజలు అవస్థలు పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు వ్యాధుల బారిన పడుతున్నారు. మండలంలోని నడుపూరు, వుడాకాలనీ, నెల్లిముక్కు, సీతానగరం ఇలా పలు ప్రాంతాల్లో గెడ్డలు ఉన్నాయి. గతంలో ఎప్పటికప్పుడు మురుగు పారే విధంగా చర్యలు తీసుకునేవారు. కానీ కొద్ది నెలలుగా నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోతుంది. దీంతో ప్రజలు వ్యాదుల బారిన పడుతున్నారు. శానిటరీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ఎక్కడ?

ఒక వైపు జీవీఎంసీ అధికారులు స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో హడావుడి చేస్తున్నారు. ప్రకటనలు గుప్పిస్తున్నారు. రోడ్ల పైనే చెత్తాచెదారం దర్శనం ఇస్తున్నా కనీసం వాటిని తొలగించే దిశగా చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వృద్ధురాలి అదృశ్యం



పెందుర్తి: పురుషోత్తపురానికి చెందిన సారిపల్లి సన్యాసమ్మ(65) అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో నివాసం ఉంటున్న సన్యాసమ్మ బుధవారం ఉదయం పొలానికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరింది. ఎంతకీ ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోయింది. దీంతో ఆమె మనుమడు చీర పైడిరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీ బి.అప్పారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సన్యాసమ్మ ఆచూకీ తెలిపిన వారికి రూ.లక్ష నజరానా ఇస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఘనంగా దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసితకాలనీ కొత్తపాలెం గ్రామదేవత దుర్గమాంబ ఆలయ 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీలు లేమర్తి, అగ్రహారం, పి.బోనంగి, కొత్తపాలెం, ఇ.బోనంగి, ఎదురువానిపాలెం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి విశేష పూజలు చేశారు. పసుపు, కుంకుమలు సమర్పించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో వేలాది మంది అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు గొల్లవిల్లి సన్యాసిరావు, సతీష్, దాసరి నీలకంఠం, పితాన నీలకంఠరావు, కండేపల్లి శంకరరావు, చిన్నారావు, గోపి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి 'సర్వహిత' బాసట



మంచాన పడిన శ్రీను కుటుంబానికి నగదు అందిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: సేవ చేయాలనే గుణం ఉంటే చాలు.. ప్రాంతంతో పనిలేదని నిరూపించుకున్నారు సర్వహిత చారిటబుల ట్రస్ట్ ప్రతినిధులు. వాట్సప్‌లో వచ్చిన వీడియో చూసి చలించిన అగనంపూడికి చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు నక్కపల్లి మండలం దొడ్డిగల్లు వెళ్లి బాధితుడికి రూ.పదివేల నగదు, నెలకు సరిపడా బియ్యం, ఇతర రేషన్ సరకులు అందించి వచ్చారు. వివరాల్లోకి వెళ్తే... అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన దొంగ శ్రీను (28) కొబ్బరి చెట్లు ఎక్కి కొబ్బరి కాయలు దించే పని చేస్తుంటాడు. రెండు మాసాల కిందట శ్రీను కొబ్బరి చెట్టు ఎక్కుతూ కాలుజారి కిందపడిపోవడంతో వెన్నుపూస విరిగిపోయి మంచానికే పరిమితమయ్యాడు. పూరిపాకలో జీవనం సాగిస్తున్న వీరికి వేరే ఆధారం లేకపోవడంతో వాట్సప్ ద్వారా సహాయాన్ని అర్థించారు. వీడియో చూసి చలించిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే సుశీలా గజేంద్రరావు, సలహాదారు పట్టా రామఅప్పారావు, చైర్మన్ మస్తాన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి లక్కరాజు రాము దొడ్డిగల్లు వెళ్లి రూ.పదివేల నగదు, నిత్యావసర సరకులు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, కార్పొరేటర్ శానాపతి వసంత

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు పరిధిలోని గిరిప్రసాద్‌నగర్, భాస్కర్‌రెడ్డి లేఅవుట్, అంబేడ్కర్‌నగర్, ద్రోణంరాజునగర్, సాయినగర్‌కాలనీ, శ్రమశక్తినగర్ కాలనీల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు బుధవారం శ్రీకారం చుట్టారు. రూ.1.67 కోట్లతో ఆయా పనులు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెల్లడించారు. ఆయా నిధులతో రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శానాపతి వసంత, నాయకులు శానాపతి శంకర్రావు, శానాపతి సోమశేఖర్, అవగడ్డ అప్పలనాయుడు, అయిత సింహాచలం, పిల్లా జగన్‌మోహన్‌పాత్రుడు, ఆయా కాలనీల ప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.